

బోరు బావుల తవ్వకాలకు దరఖాస్తుల ఆహ్వానం

కల్హేర్/సిర్గాపూర్, జనవరి 30: ఎస్సీలకు చెందిన పంట భూముల్లో బోరు బావుల తవ్వకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సిర్గాపూర్ ఎంపీడీవో సుజాత మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ ఎస్డీఎఫ్ పథకం కింద మంజూరు చేయబోయే బోరుబావుల కోసం పట్టా, అసైన్డ్ భూములు కలిగిన ఎస్సీలు అర్హులని తెలిపారు. కనీసం రెండు ఎకరాలు కలిగి ఉన్నవారు, లేదా కొంతమంది సమూహంగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీ లోపు ఎంపీడీవో కార్యాయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

అసైన్డ్ భూములకు ఎసరు

పటాన్‌చెరు నియోజకవర్గంలో వందల ఎకరాలు అన్యాక్రాంతం

- ఆక్రమణకు గురవుతున్న వందలాది ఎకరాలు
- నోటరీ డాక్యుమెంట్లతో ప్లాట్ల అమ్మకం
- అధికార పలుకుబడితో దర్జాగా వ్యాపారం
- ఇకనైనా అక్రమాలకు అడ్డుకట్ట పడేనా?



పటేల్‌గూడలో ఓ ప్రజాప్రతినిధి ఆధీనంలో ఉన్న అసైన్డ్ భూమిలో నిర్మాణం

పటాన్‌చెరు, నవంబర్ 30: పటాన్‌చెరు నియోజకవర్గంలో పెద్దఎత్తున అసైన్డ్ భూములు చేతులు మారుతున్నాయి. నియోజకవర్గంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వేలాది ఎకరాలను స్వాతంత్రసమరయోధులు, ఎక్స్‌సర్వీస్‌మెన్, భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం పంపిణీ చేసింది. కానీ ఆయా భూములు సాగుకు అనువుగా లేకపోవడంతో లబ్ధిదారులు ఏళ్ల తరబడి అటువైపు తొంగిచూడలేదు. అసైన్డ్‌దారులు నిబంధనలకు విరుద్ధంగా భూములను ఇతరులకు విక్రయించారు. అసైన్‌మెంట్ భూములు కొన్నవారిలో పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు కూడా ఉన్నారు. ఇంద్రేశం గ్రామంలో పెద్ద ఎత్తున అసైన్డ్ భూమి ప్రైవేటు వ్యక్తులకు విక్రయించారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం అపార్ట్‌మెంట్ల ఎదురుగా కొందరు వ్యక్తులు అసైన్డ్ భూములను 100 గజాల చొప్పున ప్లాట్లు చేసి అమ్మేశారు. ఐనోల్‌లో గతంలో ఓ ఇంజనీరింగ్ కళాశాల పక్కనే ఉన్న 70 ఎకరాల అసైన్డ్ భూమిని చట్టవిరుద్ధంగా కొనుగోలు చేయడం వివాదాస్పదంగా మారింది. అమీన్‌పూర్ మండలం అసైన్డ్ అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అమీన్‌పూర్ రెవెన్యూ గ్రామ పరిధిలో 993, 630 సర్వే నంబర్లలో విస్తరించిన ప్రభుత్వ భూముల్లో ప్రస్తుతం పెద్దఎత్తున ఇండ్లు నిర్మించి అమ్ముకుంటున్నారు. 343 సర్వే నంబర్‌లో గతంలో జరిగిన నకిలీ స్వాతంత్ర సమరయోధుల అసైన్డ్ భూ కుంభకోణం రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. 994 సర్వే నంబర్‌లో అసైన్డ్‌దారుల నుంచి తక్కువ ధరకు భూములు కొని దర్జాగా వంద గజాల చొప్పున విక్రయిస్తున్నారు. ఇక కిష్టారెడ్డిపేట గ్రామంలో అసైన్డ్‌భూములు పెద్ద ఎత్తున తాజాగా కబ్జాలకు గురవుతున్నాయి. సర్వే నంబర్ 164లో ఓ టీఆర్ఎస్ ప్రజాప్రతినిధి దర్జాగా అసైన్డ్‌భూమిని నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసి కబ్జాలో ఉన్నారు. పటేల్‌గూడా గ్యాస్‌గోదాం వెనకాల, గండిగూడ, దాయర, సుల్తాన్‌పూర్‌లో అసైన్డ్ భూములు కబ్జాలకు గురవుతున్నాయి. ఐలాపూర్‌లో సైతం అసైన్డ్ భూముల్లో నిర్మించిన ఇళ్లకు ఇంటి నంబర్లు, కరెంట్ కనెక్షన్లు ఇస్తున్నారు. జిన్నారం మండలం గడ్డపోతారంలో సుమారు 50 ఎకరాల అసైన్డ్ భూముల్లో ఇళ్లు, పరిశ్రమలు వెలిశాయి. పలుచోట్ల భూసేకరణకు ప్రభుత్వం ఇటీవల నోటీసులు ఇచ్చింది. అలీనగర్ సర్వే నంబర్ 27లో సుమారు 7ఎకరాల్లో కాలనీని ఏర్పాటు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఖాజిపల్లిలో మాజీ నక్సలైట్లకు ఇచ్చిన భూములు, గుమ్మడిదల, అన్నారంలో అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. రామచంద్రాపురం మండల పరిధిలో కొన్ని గ్రామాల్లో అసైన్డ్ భూముల అక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

అసైన్డ్ భూములు విక్రయిస్తే కఠిన చర్యలు

-గౌరీవత్సల, అమీన్‌పూర్ తహసీల్దార్

అసైన్డ్ భూములను విక్రయించినా, నిర్మాణాలు చేపట్టినా అసైన్‌మెంట్ పట్టాను రద్దు చేస్తాం. అమీన్‌పూర్ పరిధిలోని 993 సర్వే నంబర్ అసైన్డ్ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశాం. అసైన్డ్‌దారులపై కఠినచర్యలు తీసుకుంటామని నోటీసులు జారీచేశాం. అసైన్డ్ చట్టానికి వ్యతిరేకంగా పట్టాదారులు వ్యవహరిస్తే రద్దు చేసి ప్రభుత్వ భూమిగా ప్రకటిస్తాం.



మత్స్యశాఖలో అవినీతి చేపలు

- పైసలిస్తేనే సభ్యత్వం
- ఆరోపణలపై అధికారులను హెచ్చరించిన గత కలెక్టర్
- అంతా పుకార్లేనంటున్న అసిస్టెంట్ డైరెక్టర్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 30: సంగారెడ్డి జిల్లాలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో కొత్త సభ్యత్వం కావాలంటే అధికారులకు డబ్బులు ఇవ్వాల్సిందేనని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో సింగూరు రిజర్వాయర్‌తో కలుపుకుని 1,160 చెరువులు, కుంటలు ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం 222 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలున్నాయి. వీటిలో 10,874 మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. కాగా ఆయా సంఘాల్లో తమకు సభ్యత్వం కల్పించాలంటూ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 1,100 మంది మత్స్యకారులు కొత్తగా దరఖాస్తులు చేసుకున్నారు. మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుని, నెలలు గడుస్తున్నా సభ్యత్వం కల్పించడం లేదని పలువురు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సభ్యత్వం కావాలంటే రూ. 3వేల నుంచి రూ. 4వేల వరకు డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు ఇస్తే సభ్యత్వం ఇస్తామని అధికారులు తేల్చిచెబుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై తాము ఇంతకుముందు అప్పటి కలెక్టర్ శరత్‌ను కలిసి ఫిర్యాదు చేశామని తెలిపారు. అప్పట్లో జిల్లా కలెక్టర్ శరత్ మత్స్య శాఖ అధికారులను పిలిపించి హెచ్చరించారని పేర్కొన్నారు. తీరు మార్చుకోకపోతే ప్రభుత్వానికి సరెండర్ చేస్తానని వార్నింగ్ ఇచ్చారని వారు తెలిపారు. అయినా ఇప్పటి వరకు అధికారులు స్పందించి తమకు సహకార సంఘాలలో సభ్యత్వం కల్పించలేదని వారు వాపోతున్నారు.

ఎవరూ పైసలు అడగలేదు : అసిస్టెంట్ డైరెక్టర్

మరోవైపు ఈ ఆరోపణలను సంబంధిత అధికారులు ఖండిస్తున్నారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో సభ్యత్వం కల్పించేందుకు తమ శాఖలోని అధికారులు, ఉద్యోగులెవరూ డబ్బులు డిమాండ్ చేయలేదని మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సతీశ్ వివరించారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో సభ్యత్వం కల్పించేందుకు దరఖాస్తులు చేసుకున్న కార్మికులకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. దరఖాస్తులు చేసుకున్నవారికి చెరువులలో ఈత కొట్టడం, వల వేయడం, చేపలు పట్టడం తదితర అంశాల్లో పరీక్షలు నిర్వహించి 1,100 మందిని అర్హులుగా నిర్ధారించామని ఆయన పేర్కొన్నారు. వీరికి సభ్యత్వం కల్పించాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో సభ్యత్వం కల్పించే విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేకపోయిందన్నారు. త్వరలోనే ప్రభుత్వం వీరికి సభ్యత్వం కల్పించేందుకు సానుకూల నిర్ణయం తీసుకుంటుందని సతీశ్ తెలిపారు.

సంబరంగా పాత పంటల జాతర



జహీరాబాద్ మండలంలో డక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాత పంటల జాతర సందడిగా సాగుతున్నది. కార్యక్రమంలో భాగంగా మంగళవారం అర్జున్‌నాయక్ తండా, మూడ్ తండాల్లో ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. చిరుధాన్యాలతో అలంకరించిన ఎడ్లబండ్లను తండాల్లో ఊరేగించారు. జాతరలో మహిళా రైతులు, గిరిజనులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. డీడీఎస్ సిబ్బంది, వక్తలు చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. డీడీఎస్ జాతర కో-ఆర్డీనేటర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ అంతరించిపోతున్న పాత పంటలు, చిరుధాన్యాలను కాపాడుకోవడం కోసమే డీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

-జహీరాబాద్, జనవరి 30

సంగారెడ్డి జిల్లాలో సబ్ సెంటర్ల నిర్మాణాలకు రూ.14 కోట్లు విడుదల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి అర్బన్, జనవరి 30: సంగారెడ్డి జిల్లా సబ్ సెంటర్ల నిర్మాణానికి రూ. 14 కోట్లు విడుదల చేస్తూ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వీ.కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. సబ్ సెంటర్లను నిధులు మంజూరు కాకపోవడంతో చేపట్టిన నిర్మాణాలు నిలిచిపోవడంపై ఆంధ్రజ్యోతిలో ఈ నెల 10వ తేదీన 'ఎమ్మెల్యేలు కొబ్బరికాయ కొట్టక.. ఆర్నెళ్లుగా పెండింగ్' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కమిషనర్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం కింద చేపట్టిన 70 సబ్‌సెంటర్లకు రూ.14 కోట్ల నిధులు విడుదల చేస్తూ ఈ నెల 27న ఉత్తర్వులు జారీ చేసినట్టు అధికారులు తెలిపారు. 15వ ఆర్థిక కమిషన్ హెల్త్‌గ్రాంట్ కింద ఈ నిధులు విడుదల చేశారని వివరించారు.

మహిళా సంఘాలకు వడ్ల కమీషన్ బకాయిలపై వివరణ ఇవ్వండి

- సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి టౌన్, జనవరి 30: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి ఈ నెల 30వ తేదిన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మహిళా సంఘాలకు అందని రూ. 6.23 కోట్ల కమిషన్ బకాయిలు' అనే కథనంపై అధికారులు స్పందించారు. మహిళా సంఘాలకు కమీషన్ బకాయిలపై వివరణ ఇవ్వాలని డీఆర్‌డీఏ మార్కెటింగ్ విభాగం డీఎంను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి మూడు సీజన్ల గోనె సంచులు మహిళా సంఘాల వద్ద ఉన్నాయని, వాటి లెక్కలు ఇవ్వలేదని డీఎం వివరించారు. గోనె సంచుల లెక్కలు డీఎం కార్యాలయంలో ఇస్తే ఫిబ్రవరి 3లోగా కమీషన్ డబ్బులు చెల్లిస్తామని పౌర సరఫరాల శాఖ డీఎం వెల్లడించారు.

జోగిపేటలో ఐదెకరాల్లో ఆస్పత్రి, నర్సింగ్ కాలేజీ నిర్మాణం


- సంగారెడ్డిలో డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్ ఆఫీసులకు భవనాలు
- ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి ఆదేశం

సంగారెడ్డి అర్బన్, జనవరి 30: జోగిపేటలో నూతన ప్రభుత్వ ఆస్పత్రి, నర్సింగ్ కాలేజీ నిర్మాణాలకు కోసం ఐదెకరాల స్థలం ఎంపిక చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా సంగారెడ్డిలో కొత్తగా డీఎంహెచ్‌వో కార్యాలయం, డీసీహెచ్ఎస్ కార్యాలయాలకు కూడా పక్కా భవనాల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు రూపొందించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించినట్లు అధికారవర్గాలు తెలిపాయి.

సంగారెడ్డి జిల్లాకు 293 మంది స్టాఫ్‌నర్సులు

- నేడు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు
- బస్సుల్లో ఎల్‌బీ స్టేడియానికి చేర్చేందుకు అధికారుల ఏర్పాట్లు
- కొత్త స్టాఫ్ నర్సుల రాకతో ఆస్పత్రుల్లో తీరనున్న కొరత

సంగారెడ్డి అర్బన్, జనవరి 30: సంగారెడ్డి జిల్లాకు కొత్తగా 293 మంది స్టాఫ్‌నర్సులను కేటాయించారు. గతేడాది పరీక్ష రాసి స్టాఫ్‌నర్సు ఉద్యోగాల కోసం ఎంపికైన తుది జాబితాను ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఎంపికైనవారందరికీ సోమవారం సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో హాల్‌టికెట్లు పరిశీలించి అటెండెన్స్ తీసుకుని గుర్తింపు కార్డులు అందజేశారు. వారందరూ నేడు మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదరరాజనర్సింహ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. జిల్లాలో ఎంపికైన 293 మంది స్టాఫ్ నర్సులను బుధవారం హైదరాబాద్‌కు తరలించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నియోజకవర్గాలవారీగా ఎనిమిది ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. కొత్త స్టాఫ్ నర్సులను జిల్లాలోని వైద్య విద్యా పరిధిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ఎంసీహెచ్‌తో పాటు తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలోని ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు అదే విధంగా వివిధ సంక్షేమ శాఖలకు చెందిన రెసిడెన్షియల్ గురుకుల విద్యాలయాల్లో నియమించనున్నారు. కొత్త సిబ్బందిని కేటాయించడంతో ఆయా ఆస్పత్రులు, విద్యాలయాల్లో గత కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్న స్టాఫ్ నర్సుల కొరత తీరనుంది.



ఇంకెన్నాళ్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో?

సంగారెడ్డి జిల్లాకు రెగ్యులర్ డీఎంహెచ్‌వోను నియమించాలని కోరుతూ లంబాడా హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డా.రవీందర్‌నాయక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలో మూడేళ్లుగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో పర్యవేక్షణనే కొనసాగుతున్నదని, రెగ్యులర్ డీఎంహెచ్‌వోగా డా.లక్ష్మణ్‌సింగ్‌ను గత ప్రభుత్వం నియమించినప్పటికీ జిల్లా యంత్రాంగం ఆయనను విధుల్లో చేరకుండా ఇబ్బందులకు గురిచేసిందని ఫిర్యాదు చేశారు.

-సంగారెడ్డి అర్బన్, జనవరి 30

జిల్లా పరిషత్ సమావేశంలో సీఎం ఫొటో పెట్టరా?

- అధికారులైనా చొరవ చూపాలి కదా!
- ఓట్ల కోసం డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహించినవారు లైసెన్సులు ఇవ్వరా
- మెదక్ ఎమ్మెల్యే రోహిత్ మండిపాటు

మెదక్, జనవరి 30: ప్రభుత్వ కార్యాలయాలు, సమావేశ మందిరాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ఏర్పాటు చేయరా? ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోయినా కనీసం అధికారులైనా పూనుకుని సీఎం ఫొటోను పెట్టరా అని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా పరిషత్ 7వ స్థాయీ సంఘం సమావేశం జడ్పీ ఛైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. నీటిపారుదల, విద్యుత్, మిషన్ భగీరథ, ఆర్అండ్‌బీ తదితర శాఖల పరిధిలో అభివృద్ధి పనుల పురోగతిపై సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు మెదక్ పట్టణంలో యువతకు డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహించిన రవాణాశాఖ అధికారులు లైసెన్స్‌లు ఇవ్వడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఎంవీఐని ప్రశ్నించారు. డ్రైవింగ్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి వెంటనే లైసెన్సులు జారీ చేయాలని ఆదేశించారు. నిజాంపేట మండల కేంద్రంలో సబ్ సెంటర్ భవన నిర్మాణం పూర్తయినందున ప్రారంభించాలని జడ్పీటీసీ విజయ్‌కుమార్ కోరారు. దీనిపై స్పందిస్తూ ఇంకా కొన్ని పనులు మిగిలి ఉన్నాయని, సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదని పంచాయతీరాజ్ శాఖ అధికారి తెలిపారు. పాపన్నపేట మండలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు పూర్తి చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఎమ్మెల్యే అధికారులను నిలదీశారు. పనులను త్వరితగతిన పూర్తిచేస్తే ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై సంబంధిత అధికారి స్పందిస్తూ పనులు చివరి దశకు చేరుకున్నాయని త్వరలోనే నిర్మాణం పూర్తిచేస్తామని వివరించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు పూర్తిచేసి, నియోజకవర్గంలో సమస్యలనేవే లేకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. పెండింగ్ పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలని నిలదీశారు. సమావేశానికి హాజరుకాని జిల్లా రవాణా అధికారి క్రిష్టఫర్, చీఫ్ ప్లానింగ్ అధికారులకు మెమోలు జారీ చేయనున్నట్లు జడ్పీ సీఈవో శైలేష్ సభకు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

ఎన్నికలకు ముందు నిధుల మంజూరుపై జీవోల డ్రామా

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే, సభ్యులు

మెదక్ అర్బన్, జనవరి 30: పదేళ్లు అధికారంలో ఉండి మెదక్ పట్టణాన్ని ఏం అభివృద్ధి చేశారని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు మున్సిపల్ పాలకమండలిని నిలదీశారు. మెదక్ మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని ఛైర్మన్ చంద్రపాల్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. తొలిసారి మున్సిపల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే రోహిత్‌ను పాలకవర్గం సన్మానించింది. అనంతరం ప్రశ్నోత్తరాల సమయంలో పట్టణ సమస్యలు.. వార్డుల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు. 2018లో ఔరంగబాద్, అవుసులపల్లి, పిల్లికోటాల్ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేసిన సమయంలో రూ. 2.40 కోట్లతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారని కౌన్సిలర్ పేర్కొన్నారు. పెండింగ్ ఉన్న నిధులను విడుదల చేసి, పట్టణాన్ని అగ్రస్థానంలో నిలపాలని కౌన్సిలర్ కల్యాణి కోరారు. మున్సిపల్ కాంప్లెక్స్‌లోని షాపులను వేలం వేసి దళితులకు, బీసీలకు కేటాయించాలని కో ఆప్షన్ మెంబర్ గంగాధర్ పేర్కొన్నారు. కొత్త మార్కెట్ ఏర్పాటు చేసి వార్డు ప్రజలు ఇబ్బందులను పరిష్కరించాలని కౌన్సిలర్ మేఘమాల కోరారు. మెదక్‌ను పర్యాటక కేంద్రంగా చేయాలని, కోతుల బెడదను పరిష్కరించాలని కౌన్సిలర్ బట్టి లలిత ఎమ్మెల్యేకు విన్నవించారు. పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్ ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉండి ఏం అభివృద్ధి చేశారని పాలకవర్గాన్ని ప్రశ్నించారు. ఎన్నికల ముందు నిధుల మంజూరు ప్రకటనలతో మోసం చేశారని ఆరోపించారు. ఆ జీవోలు పేపర్ ప్రకటనలకే పరిమితమయ్యాయని, వార్డుల అభివృద్ధి నిధులే లేవని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మెదక్‌ను గత ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని విమర్శించారు. జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల నిర్మాణాల పేరుతో కమీషన్లు తీసుకోవడంతో నాణ్యత లోపించిందని ఆరోపించారు. మున్సిపాలిటీకి మంజూరు చేసిన రూ. 20 కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. మెదక్‌కు రింగ్‌రోడ్డు, ఏడుపాయాల అభివృద్ధికి రూ. 100 కోట్లు హామీల సంగతేంటని నిలదీశారు. ఎన్నికల్లో తనకు వ్యవస్థ మొత్తం వ్యతిరేకంగా చేసినా ప్రజలే ఆదరించారన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి

గుమ్మడిదల, జనవరి 30 : గుమ్మడిదల అటవీ సెక్షన్ పరిధిలోని నల్లవల్లి గ్రామ శివారులో మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ భల్బిత్ సింగ్ సిబ్బందితో అక్కడికెళ్లి, పోస్టుమార్టం అనంతరం దహనసంస్కారాలు నిర్వహించారు. గతంలోనూ ఎన్నో వన్యప్రాణులు వాహనాదారుల అతివేగం కారణంగా ప్రాణాలు కోల్పోయాయి. అయినా ఫారెస్టు అధికారులు రక్షణ చర్యలు తీసుకోవడంలో విఫలమతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.



ప్రమాదంలో మృతిచెందిన జింక

మెదక్‌లో ఇంటర్ మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

మెదక్ అర్బన్, జనవరి 30: మెదక్ కేంద్రంగా ఇంటర్మీడియట్ మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఇంటర్ విద్యా జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మైనంపలి రోహిత్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శశిధర్, అశోక్, సురేష్‌బాబు మాట్లాడుతూ.. గతంలో ఉమ్మడి జిల్లా క్యాంప్ కార్యాలయం మెదక్‌లో ఉండేదని, ఆ తర్వాత సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు కేటాయించారన్నారు. మూల్యాంకన కేంద్రం ఏర్పాటుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు అవనిష్‌రెడ్డి, శ్రీకాంత్, మహాలక్ష్మిదేవి, ఉస్మాన్ పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు, వ్యక్తి మృతి

జహీరాబాద్, జనవరి 30: బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ప్రమాదం జహీరాబాద్ మండలంలోని బూడ్దిపాడ్ శివారులో 65వ నెంబరు జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం చోటుచేసుకున్నది. కర్ణాటకలోని మన్నెల్లికి చెందిన వినోద్(31) వ్యక్తిగత పనులమీద జహీరాబాద్‌కు వస్తున్నాడు. వెనుకవైపు నుంచి వచ్చిన కారు అతని బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వినోద్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వినోద్ భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జహీరాబాద్ రూరల్ ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.



మృతిచెందిన వినోద్

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్, జనవరి 30: మొగుడంపల్లి మండలంలోని విట్టునాయక్ తండాలో మాణిక్(40) అనే వ్యక్తి మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విట్టునాయక్‌తండాకు చెందిన మాణిక్‌కు హైదరాబాద్‌కు చెందిన సంధ్యతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. కొన్నాళ్లుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో అతడు తన స్వగ్రామానికి వచ్చి పొలం పనులు చేసుకుంటున్నాడు. జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ఆసుపత్రికి తరలించించారు. మాణిక్ తల్లి జమ్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

'ఆదర్శ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలి'

పుల్‌కల్, జనవరి 30: మండలంలోని బస్వాపూర్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏబీవీపీ, వీహెచ్‌పీ అధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీహెచ్‌పీ ధర్మ ప్రసార్ రాష్ట్ర సహా ప్రముఖ్ మధురనేని సుభాష్ చందర్ మాట్లాడుతూ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిహెబ్సీబా పాఠశాలలో సమస్యలు పరిష్కరించకుండా, క్రైస్తవ మత ప్రచారానికి ప్రాధాన్యతనిస్తున్నారని ఆరోపించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వ్యవహారశైలి పట్ల తెలంగాణ ఆదర్శ పాఠశాల రాష్ట్ర డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నా, ప్రిన్సిపాల్ జ్యోతిహెబ్సీబా పట్టించుకోవడం లేదని అన్నారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవో దండు అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆదర్శ పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న సుభాష్‌చందర్, విద్యార్థులు

అప్పుల బాధతో రియల్టర్ ఆత్మహత్య

● సంగారెడ్డి జిల్లా రామేశ్వరంబండలో ఘటన



చెన్నకేశవరెడ్డి(ఫైల్)

పటాన్‌చెరు, జనవరి 30: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అప్పులపాలైన ఓ రియల్టర్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామేశ్వరంబండ గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... రామేశ్వరంబండ గ్రామానికి చెందిన చెన్నకేశవరెడ్డి భార్య, ఇద్దరు పిల్లలతో పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్‌లో నివాసముంటున్నాడు. కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టాలు చవిచూడటంతో అప్పులు ఇచ్చిన వ్యక్తుల నుంచి ఒత్తిడి పెరిగింది. ఇచ్చిన డబ్బులు తిరిగి చెల్లించాలని ఫోన్లలో తరచూ వేధింపులకు దిగడంతో అప్పులు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన చెన్నకేశవరెడ్డి అర్ధరాత్రి సమయంలో రామేశ్వరంబండ గ్రామ శివారులోని ఆయన పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం తెల్లవారుజామున గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పటాన్‌చెరు పోలీసులు తెలిపారు.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సుందరీకరణ పనుల శంకుస్థాపనకు వచ్చిన మోదీకి చేర్యాల పెయింటింగ్‌ను అందజేస్తున్న రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్(ఫైల్)



హైదరాబాద్‌కు వచ్చిన బ్రిటీష్ హై కమిషనర్ అలెక్స్ ఎల్లిస్‌కు చేర్యాల పెయింటింగ్‌ను అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి(ఫైల్)



దావోస్ పర్యటనలో అతిథులకు చేర్యాల పెయింటింగ్‌ను కానుకగా అందిస్తున్న ఐటీమాజీ మంత్రి కేటీఆర్(ఫైల్)

వన్నె తగ్గని చేర్యాల నకాశీ పెయింటింగ్

● అతిథులకు అధికారిక లాంఛన కానుకగా ఆకర్షణ

చేర్యాల, జనవరి 30: ప్రస్తుత పోటీతత్వ పరిస్థితులలో రోజుకో కొత్త కళ ఆవిర్భవిస్తున్నా వారసత్వ కళగా వెలుగులోకి వచ్చి అంతర్జాతీయ ఖ్యాతి గడించిన చేర్యాల పెయింటింగ్స్ హవా కొనసాగుతూ ఉన్నది. పాలకులు మారినా, ప్రజాప్రతినిధులు మారినా, అధికారులైనా, అతిథులు ఎవరైనా వారి చేతుల్లో ఒదిగి రాష్ట్ర కీర్తిని ఇనుమడింపజేస్తూ ఔరా అని మంత్రముగ్ధులను చేస్తున్నది. గతంలో కాన్వాజ్ వస్త్రంపైనే రూపుదిద్దుకున్న నకాశీ చేర్యాల పెయింటింగ్స్ కాలానికనుగుణంగా రూపాంతరం చెంది ప్రభుత్వ లాంఛన వస్తు కానుకగా మారడంతో చేర్యాల పేరు మారుమోగుతున్నది. పలు ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వేస్టేషన్లు, అండర్‌పాస్ బ్రిడ్జిలపై వాల్ పెయింటింగ్స్‌గా నిలిచిన చేర్యాల చిత్రకళలతో కొన్నాళ్ల క్రితం రాజ్‌భవన్‌లో టన్నెల్‌ను సుందరీకరించారు. టన్నెల్‌ను ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చిత్రకళలను అభినందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఐటీమంత్రి కేటీఆర్ విదేశీ పర్యటనలలో అతిథులతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులకు మర్యాదపూర్వకంగా చేర్యాల పెయింటింగ్స్‌ను అందించారు. కొన్నినెలల క్రితం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ శంకుస్థాపనకు వచ్చిన ప్రధాని మోదీకి రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చేర్యాల పెయింటింగ్స్‌ను అందించారు. కొద్దిరోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనలో అతిథులతో పాటు ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన బ్రిటీష్ హైకమిషనర్ అలెక్స్ ఎల్లిస్‌కు చేర్యాల పెయింటింగ్‌ను అందజేశారు.

ఇలా వచ్చి.. అలా వెళుతున్నారు!

● డిప్యూటేషన్‌పై వెళుతున్న వైద్యులు, వైద్య సిబ్బంది

● ఇబ్బందులు పడుతున్న అల్లాదుర్గం ప్రజలు



అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అల్లాదుర్గం, జనవరి 30: గ్రామీణ ప్రాంత రోగులకు వైద్య సేవలందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులకు డిప్యూటేషన్ రోగం పట్టుకుంది. ఈ ఆసుపత్రిలోని వైద్యాధికారిణితో పాటు వైద్యసిబ్బంది డిప్యుటేషన్లపై వారికి అనుకూలంగా ఉన్న మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు బదిలీ చేయించుకుంటున్నారు. ఈ ఆసుపత్రిలో విధులు నిర్వహించే కింది స్థాయి నుంచి వైద్యాధికారి వరకు బదీలీ కావడంతో ఈ ప్రాంత రోగులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ అశ్విని డిప్యూటేషన్‌పై వికారాబాద్ జిల్లాలకు బదిలీ కాగా ఆమె స్థానంలో జిల్లాలోని పెద్దశంకరంపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి సారిక ఇక్కడికి వచ్చారు. ఇదిలా ఉంటే స్టాఫ్ నర్సు విజయరూప డిప్యూటేషన్‌పై సంగారెడ్డి జిల్లాలోని మరో ఆసుపత్రికి బదిలీ కాగా ఆమె స్థానంలో ఇంతవరకు ఎవ్వరినీ నియమించలేదు. మహిళా సూపర్‌వైజర్ స్వరూప సైతం వికారాబాద్ జిల్లాకు బదీలీ అయింది. ఈ రెండు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఆసుపత్రిలో సూపర్‌వైజర్ యాదయ్య రెండేళ్ల క్రితం పదోన్నతిపై బదిలీ కాగా ఆయన స్థానంలో ఇతరులను నియమించకపోవడంతో ఇదీ ఖాళీగా ఉన్నది. ఈ ఆసుపత్రి మహిళా ఏఎన్ఎంలు ఇద్దరు బదిలీ కాగా వారి స్థానంలో ఎవరినీ నియమించకపోవడం శోచనీయం. ఇలా ఈ ఆసుపత్రికి వచ్చిన వైద్యాధికారులు, వైద్యసిబ్బంది అలా వచ్చి ఇలా డిప్యుటేషన్లపై బదిలీ చేకోవడం పట్ల మండల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టెన్త్ విద్యార్థులకు 'కేసీఆర్ డిజిటల్ కంటెంట్ గిఫ్ట్'

● సిద్దిపేట నియోజకవర్గం అగ్రస్థానంలో నిలిచేలా హరీశ్‌రావు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం

సిద్దిపేట క్రైం, జనవరి 30: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించేలా ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి వాటిని పాటించేలా చేస్తున్నారు మాజీ మంత్రి హరీశ్‌రావు. గత సంవత్సరం నుంచి డిజిటల్ కంటెంట్ రూపంలో జిల్లాలోని పదో తరగతి విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు. ఈ సంవత్సరం సిద్దిపేట నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులకు ఇవ్వనున్నారు.

తల్లిదండ్రులకు ఉత్తరం, ఇంట్లో డిజిటల్ పాఠాలు

ఒక వైపు ఉత్తరం.. మరోవైపు పాఠశాలలో ప్రత్యేక తరగతులు వీటితో పాటు సరికొత్త కార్యక్రమానికి హరీశ్‌రావు స్వయంగా శ్రీకారం చుట్టారు. ప్రత్యేక తరగతులతో పాఠశాలలో చదివితే, ఇంట్లో ఉండి చదివేల వారి మేధస్సుకు ఇంకా పదును పెట్టేలా డిజిటల్ స్టడీ అనే వినూత్న కార్యక్రమాన్ని గత సంవత్సరం ప్రారంభించారు. త్వరలో నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అందజేయనున్నారు. డిజిటల్ కంటెంట్‌తో గతేడాది మెరుగైన ఫలితాలు వచ్చిన నేపథ్యంలో ఈసారి అందజేస్తున్నారు. ఇంట్లో కూడా అర్థం కానీ పాఠాలను చదివేల ఈ కార్యక్రమం చేపట్టారు. 'కేసీఆర్ డిజిటల్ కంటెంట్ టీహెచ్ఆర్ గిఫ్ట్' పేరుతో పదో తరగతి విద్యార్థులకు డిజిటర్ బుక్‌లు అందజేస్తున్నారు. పదో తరగతి భవితకు పునాదని, పైచదవులకు స్ఫూర్తి కావాలని, పాఠశాలలోనే కాదు ఇంటి వద్ద చదువుకునే కొత్త కార్యక్రమానికి మంత్రి శ్రీకారం చుట్టి విద్యార్థుల్లో ఉత్సాహం నింపి ఆత్మవిశ్వాసం కల్పిస్తున్నారు. సిద్దిపేట జిల్లా పదో తరగతి ఫలితాల్లో గతేడాది రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది సిద్దిపేట నియోజకవర్గం అగ్రస్థానంలో నిలిచేలా హరీశ్‌రావు విద్యాశాఖ అధికారులకు ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు నేరుగా ఉత్తరం రాయడంతో పాటు వారిని ఇంటి వద్ద చదివించేలా ప్రోత్సహిస్తున్నారు.



రాచన్నస్వామి హుండీ ఆదాయం రూ.3.35 లక్షలు

కోహీర్, జనవరి 30: మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల రాచన్న స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించామని ఈవో శివ రుద్రప్ప తెలిపారు. గడిచిన నాలుగు నెలలకు సంబంధించి భక్తులు స్వామివారికి సమర్పించుకున్న హుండీ ఆదాయం రూ.3 లక్షల 35 వేల 388 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, గ్రామస్థులు సుధాకర్, రాజప్ప, ప్రతాప్‌రెడ్డి, రాచన్న, శ్రీపాల్, శంకరయ్య, స్వామి, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



బడ్ చిప్ సాగుతో ప్రయోజనం

● తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు

● రైతులు ఈ విధానం పాటిస్తే మరింత ఉపయోగం



కేవీకేలో బడ్‌చిప్‌తో(చెరకు కన్నులు) పెంచిన చెరకు నారు

జహీరాబాద్, జనవరి 30: జహీరాబాద్ ప్రాంతంలో రైతులు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుంటారు. ముఖ్యంగా జహీరాబాద్ ప్రాంత భూములు గరుకు, ఎర్రనేలతో కూడినవిగా ఉండడంతో రైతులు ప్రధాన పంటగా చెరకును సాగుచేస్తారు. చెరకు పంట తరలింపు తదితర విషయాల్లో నష్టం వచ్చినా అన్ని వాతావరణాలకు తట్టుకుని పండే పంట కాబట్టి ఈ ప్రాంత రైతులు చెరకు సాగుపై అమితాసక్తిని చూయిస్తారు.

బడ్ చిప్ విధానంతో సాగు ఇలా...

రైతులు సహజంగా చెరకు గడలను ముక్కలుగా నరికి వారివారి పంట పొలాల్లోని కాలువల్లో వేసి నీటిని వదులుతూ చెరకు గడలను కాళ్లతో తొక్కుతారు. ఈ విధానం వల్ల చెరకు విత్తనం ఎకరాకు సుమారు 8 టన్నుల వరకు కావాల్సి వస్తున్నది. చెరకు ముక్కలను పొలాల్లో వేసి నాటితే ఎకరాకు రూ.50-60వేల వరకు ఖర్చవుతున్నది. బడ్ చిప్ విధానం ద్వారా సాగుచేస్తే ఎకరాకు చెరకు విత్తనం 4 టన్నులు మాత్రమే సరిపోతున్నదని రైతులు, అధికారులు పేర్కొంటున్నారు. ఇందుకు గాను రూ.30-40 వేల వరకే ఖర్చవుతుందని వారు వివరించారు. చెరకు గడలకు ఉన్న కన్నులను తొలగించి పాలిహౌజ్‌లో నారుగా తయారు చేసి పొలాల్లో మొక్కలను నాటడాన్ని బడ్‌చిప్ విధానమని అధికారులు తెలిపారు. చెరకు గడలకు ఉన్న కన్నులను కూలీల ద్వారా, లేక యంత్రం ద్వారా తొలగిస్తారు. తొలగించిన చెరకు కన్నులను ఒక దగ్గర పోగుచేసి ముందస్తుగా విత్తన శుద్ధి చేస్తారు. అనంతరం వాటిని ట్రేలలో ఏర్పాటు చేసిన గడులను కోకాపాట్‌తో నింపి కన్నులు వేసి నారుమడుల తరహాలో 25-30 రోజుల వరకు పాలిహౌజ్‌లను ఏర్పాటు చేసి పెంచుతారు. పెరిగిన చెరకు నారును పొలాల్లో మొక్కకు మొక్కకు 20-30 సెంటీమీటర్లు మధ్య దూరంలో నాటుతారు. ఈ విధంగా నాటడం వల్ల మొక్కకు తోడుగా పిలకలు ఎక్కువ సంఖ్యలో వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

బడ్‌చిప్ విధానంపై అవగాహన కల్పిస్తున్నాం

రైతులకు బడ్‌చిప్ విధానం ద్వారా చెరకు పంటలను సాగు చేయాలని తరచూ అవగాహన కల్పిస్తున్నాం. ఈ విధానం ద్వారా తక్కువ ఖర్చు వస్తుంది. కేవీకే ఆధ్వర్యంలో ప్రతియేటా రెండేసి గ్రామాల చొప్పున పెంచిన విత్తనాన్ని కొంతమంది రైతులకు ఇస్తున్నాం. ఈ ఏడాది బిడెకన్న, చీలపల్లి, రేజింతల్, సిద్ధాపూర్‌తండా తదితర ప్రాంతాల్లో ఎకరాకు సరిపడ నారును 50 మంది రైతులకు అందజేస్తాం.

- రమేష్, డీడీఎస్-కేవీకే పంట యాజమాన్య శాస్త్రవేత్త

నార్సింగి విద్యార్థులకు కరాటేలో గోల్డ్‌మెడల్స్



గోల్డ్ మెడల్ సాధించిన నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

చేగుంట, జనవరి 30: నార్సింగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు కరాటే పోటీలలో గోల్డ్ మెడల్స్ సాధించారు. సెకండ్ ఇంటర్నేషనల్ ఓపెన్ ఇన్విటేషన్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ ఇండోర్ స్టేడియంలో 28, 29 తేదీల్లో జరిగిన కరాటే పోటీల్లో నార్సింగి నుంచి ప్రణతి, గీతిక, శరణ్య మొదటిస్థానంలో గోల్డ్ మెడల్స్, సర్టిఫికేట్స్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ హీరో సుమన్, కరాటే మాస్టర్ సంపత్‌కుమార్, గ్రాండ్ మాస్టర్ హరిప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్, పీఈటీ శ్రీధర్‌రెడ్డి తదితరులు అభినందించారు. ఈ విషయం తెలుసుకున్న జడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి పాఠశాలకు చేరుకుని విద్యార్థులను అభినందించి ఆర్థికంగా సహాయం చేస్తానని హామీఇచ్చారు. ఇందులో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మైలారం బాబు, ప్రధాన కార్యదర్శి అంచనూరి రాజేష్, నర్సంపల్లి మాజీ ఎంపీటీసీ సత్తయ్య పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



శ్రీహరి(ఫైల్)

రాయపోల్, జనవరి 30: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాయపోల్ గ్రామానికి చెందిన బ్యాగరి శ్రీహరి(40) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. రోజు మాదిరిగానే సోమవారం కడుపులో నొప్పి వస్తుందని ఇంట్లో తెలుపగా భార్య గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయించింది. అనంతరం ఆమె అంగన్‌వాడీ కార్యకర్త కావడంతో కేంద్రానికి వెళ్లింది. విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి శ్రీహరి రేకుల షెడ్డులో ఉరేసుకుని మృతిచెంది ఉన్నాడు. భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.



బడికి తాళం.. ఆరుబయటే విద్యార్థులు!

నాగల్‌గిద్ద మండల పరిధిలోని కిషన్‌నాయక్‌తండా ప్రాథమిక పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులూ మంగళవారం విధులకు డుమ్మా కొట్టారు. దీంతో పాఠశాల తలుపులు తెరుచుకోకపోవడంతో విద్యార్థులు ఆరుబయటే ఉన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సరిగ్గా విధులు నిర్వహించే ఉపాధ్యాయులను పంపాలని తండావాసులు కోరుతున్నారు. - నాగల్‌గిద్ద

'దళితబంధు'కు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలి

● సర్పంచ్ ఇంటి ఎదుట దళితుల ఆందోళన



సర్పంచ్ ఇంటి ఎదుట కుటుంబసభ్యులతో కలిసి ఆందోళనకు దిగిన దళితులు

మద్దూరు, జనవరి 30: దళితబంధు ఇప్పిస్తాననడంతో రెండున్నరేళ్ల క్రితం అప్పులుచేసి డబ్బులు ఇచ్చామని, వాటిని తిరిగి ఇవ్వాలంటూ సర్పంచ్ ఇంటి ఎదుట ఎమ్మార్పీఎస్ మండల నాయకులతో కలిసి బాధితులు ఆందోళనకు దిగారు. దూళిమిట్ట మండలం తోర్నాల గ్రామానికి చెందిన మ్యాక యాదగిరి, పంగ ఎల్లయ్య, పేరం రవి, మ్యాక శేఖర్, పేరం పరశురాములు, ఎర్ర మల్లేశం సర్పంచ్ తాళ్లపల్లి రాజమ్మ కుమారుడు భిక్షపతిని రెండున్నరేళ్ల క్రితం దళితబంధులో అవకాశం కల్పించాలని కోరగా.. కొన్ని ఖర్చులు ఉంటాయని ఒక్కొక్కరు రూ.లక్ష ఇవ్వాలని చెప్పాడు. అందుకు ఐదుగురు లక్ష ఇవ్వగా.. పేరం పరశురాములు రూ.50 వేలు మొత్తం రూ.5.50 లక్షలు అందించారు. అయితే రెండున్నరేళ్లుగా దళితబంధులో అవకాశం కల్పించకపోవడంతో నిలదీయగా.. వచ్చే జాబితాలో వస్తుందని మభ్యపెట్టాడని తెలిపారు. అయినా రాకపోవడంతో సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వద్దకెళ్లి విషయం చెప్పామన్నారు. దీంతో ఎమ్మెల్యే సర్పంచ్ కుమారుడికి ఫోన్‌చేసి తీసుకున్న డబ్బులు ఇవ్వాలని చెప్పారు. మంగళవారం బాధితులు భిక్షపతి ఇంటికి వెళ్లి డబ్బులు ఇవ్వాలని కోరగా.. 'నేనెందుకు ఇస్తాను.. నేను ఎవరికి ఇచ్చానో వారి నుంచి వసూలు చేసి ఇస్తానని చెప్పడంతో కుటుంబసభ్యులతో కలిసి సర్పంచ్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగామన్నారు. తాను మండలంలో ఓ పెద్ద మనిషికి డబ్బులు ఇచ్చానని చెప్పి సర్పంచ్ కుమారుడు చేర్యాలకు వెళ్లిపోయాడని బాధితులు వాపోయారు. దళితుల నుంచి తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ మాజీ మండలాధ్యక్షుడు సుందరగిరి భాస్కర్ డిమాండ్ చేశారు.



గాంధీ సిద్ధాంతాలు స్ఫూర్తిదాయకం

మహాత్మాగాంధీ వర్ధంతిని మంగళవారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో నిర్వహించారు. ఆయా కార్యాలయాల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు గాంధీ చిత్రపటాలకు, విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. గాంధీ సిద్ధాంతాలు స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించడంలో ఆయన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు.

మెదక్ అర్బన్, జనవరి 30: మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షిషా గాంధీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ రమే‌ష్‌తోపాటు జిల్లా అధికారులతో కలిసి మౌనం పాటించారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ పాల్గొన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎస్పీ బాలస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పాల్గొన్నారు.

● **జహీరాబాద్:** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్ఎస్ నాయకులు గాంధీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సుభా‌ష్‌రావు ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

● **శివ్వంపేట:** మండలంలోని ఎదుల్లాపూర్‌లో గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే సునీతారెడ్డి నివాళులర్పించారు.

● **పటాన్‌చెరు:** పటాన్‌చెరులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి గాంధీ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

● **సంగారెడ్డి అర్బన్:** సంగారెడ్డిలోని గంజిమైదాన్‌లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీకి ఘనంగా నివాళులర్పించారు. ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్‌మహేందర్ జడ్పీ ఆవరణలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మెదక్ కలెక్టరేట్‌లో మౌనం పాటిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, జిల్లా అధికారులు

● **జిన్నారం:** మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ రవీందర్‌గౌడ్, బొల్లారం మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్ సంగారెడ్డి గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **పెద్దశంకరంపేట:** పెద్దశంకరంపేటలో మహాత్మగాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మిరమేష్, మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

●**నాగల్‌గిద్ద:** మండల పరిధిలోని మోర్గి మోడల్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమేష్ ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

● **నారాయణఖేడ్:** ఖేడ్ పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీచిత్రపటానికి నివాళులర్పించారు. గాంధీ చౌక్ వద్ద ఆర్యవైశ్య సంఘంతోపాటు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బోజిరెడ్డి, రమేష్ చౌహాన్, సంగన్న, కిషన్‌నాయక్, శంకర్‌ముదిరాజ్, అశోక్‌రెడ్డి, జిల్లా ఆర్యవైశ్యమహాసభ అధ్యక్షుడు మాణిక్‌ప్రభు పాల్గొన్నారు.

● **నర్సాపూర్:** నర్సాపూర్‌లోని ఎల్లంకి డిగ్రీ కాలేజీలో గాంధీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.



ఎదుల్లాపూర్‌లో నివాళులర్పిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



పటాన్‌చెరులో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఖేడ్‌లో మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జహీరాబాద్‌లో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

పాఠశాల భవనాలు ప్రారంభం

పటాన్‌చెరు, జనవరి 30: పటాన్‌చెరు మండల పరిధిలోని రామేశ్వరంబండ గ్రామంలో రూ.కోటి 20లక్షలతో నిర్మించిన ప్రాథమికోన్నత పాఠశాల భవనాలు, వీకర్ సెక్షన్ కాలనీలో రూ.60లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను మంగళవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మన ఊరు-మన బడి పథకం కింద ప్రభుత్వ బడుల్లో మెరుగైన వసతులు కల్పించామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి చేసేందుకు పరిశ్రమల యాజమాన్యాలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ధరణీఅంతిరెడ్డి, జడ్పీటీసీ సుప్రజవెంకట్‌రెడ్డి, ఎంపీపీ ఈగ సుష్మశ్రీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులు దశరథరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ, కిష్టారెడ్డిపేట, ఐలాపూర్, గండిగూడ, దాయర, వడక్‌పల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు, యూజీడీలు, కమ్యూనిటీ గదులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ ఈర్ల దేవానంద్, వైస్ ఎంపీపీ సునీతసత్యనారాయణ, సర్పంచులు పాల్గొన్నారు.

బీజేపీకి సీనియర్ల రాజీనామా

తూప్రాన్, జనవరి 30: బీజేపీకి ఇద్దరు సీనియర్ నాయకులు మంగళవారం రాజీనామా చేశారు. తూప్రాన్ పట్టణం పడాలపల్లికి చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మట్టెల ఆంజనేయులు యాదవ్, బీజేపీ దళిత మోర్చ జిల్లా అధ్యక్షుడు సంఖ్య యాదగిరి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బీజేపీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు, పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా మట్టేల యాదగిరి ఇటీవలే ఢిల్లీ వెళ్లి బీజేపీ పార్లమెంట్ టికెట్ కోసం దరఖాస్తు కూడా చేశారు.

ఒత్తిడికి లోనుకాకుండా చదవాలి

జోగిపేట, జనవరి 30:ఒత్తిడికి లోనుకాకుండా చదివితే పదో తరగతి పరీక్షల్లో విజయం సాధించవచ్చని అందోలు-జోగిపేట ఆర్డీవో ఆర్.పాండు సూచించారు. మంగళవారం ఆయన రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి అందోలులోని గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థినులతో సమావేశమై, పలు సూచనలు చేశారు. అంతకుముందు వంటగదిని, స్టోర్ రూంను, భోజన శాలను పరిశీలించి, విద్యార్థినులతో సహపంక్తి భోజనం చేశారు. ఆయన వెంట తహసీల్దారు అంథోనీ డియోనిసియో, జోగిపేట సీఐ నాగరాజు, గురుకుల వైస్ ప్రిన్సిపాల్ అజ్మత్ బేగం, సూపరింటెండెంట్ గంగాధర్ స్వామి, సిబ్బంది సుజన, అలివేణి ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

జహీరాబాద్: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరుచుకుని క్రమశిక్షణతో చదవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరికృష్ణ పేర్కొన్నారు. మండలంలోని అల్గోల్ గ్రామంలో గల మైనార్టీ బాలుర గురుకుల కళాశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. మోటారువాహనాలు, బాలకార్మిక నిర్మూలన, సమాచార, బాల్య వివాహాలు, పోక్సో తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు సాలోమాన్, కార్యదర్శి సంతో‌ష్‌కుమార్, న్యాయవాదులు, గోపాల్, సందీప్, మాణిక్ పాటిల్, గురురాజ్, ప్రిన్సిపాల్‌లు రాములు, జమీల్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

చిన్నశంకరంపేట, జనవరి 30: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం సైబర్ నేరాలు, షీటీంలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ లక్ష్మణ్ సూచించారు. బాలకార్మిక నిర్మూలన, సమాచార, బాల్యవివాహాలు, పోక్సో తదితర చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆయా చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలకార్మికుల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేందర్ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు షురూ

● **13 వరకు అవగాహన కార్యక్రమాలు**

సంగారెడ్డి అర్బన్/ పుల్‌కల్/ చిన్నశంకరంపేట, జనవరి 30: కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కుష్ఠు వ్యాధిగ్రస్థులకు మహాత్మాగాంధీ ఎంతో సేవ చేశారు. అందుకే గాంధీ వర్ధంతి జనవరి 30న యాంటీ లెప్రసీ డేగా పరిగణిస్తారు. పక్షోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 13వరకు 15 రోజుల పాటు స్పర్శ లెప్రసీ అవేర్‌నెస్ క్యాంపెయిన్ పేరిట వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కుష్ఠు వ్యాధి నివారణ మార్గాలపై అవగాహన కల్పించనున్నారు. జిల్లాలో 108 మంది కుష్ఠు వ్యాధిగ్రస్థులున్నట్లు లెప్రసీ విభాగం అధికారులు తెలిపారు. మంగళవారం జహీరాబాద్‌లోని లెప్రసీ కాలనీలో కుష్ఠు వ్యాధిగ్రస్థులకు వైద్య ఆరోగ్య శాఖ డీపీఎంవోలు మారుతి, ప్రతా‌ప్‌గౌడ్, వెంకటరమణ సామగ్రిని పంపిణీ చేసి, అవగాహన కల్పించారు. చౌటకూర్ మండలం శివంపేట జడ్పీహెచ్ఎస్‌లో కుష్ఠువ్యాధిపై జిల్లా పొగాకు నియంత్రణ సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నశంకరంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి వైద్యాధికారి సాయిసింధు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో అవగాహన కల్పిస్తున్న డీపీఎంవోలు

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

● **ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్, ధర్నా**

సంగారెడ్డి రూరల్, జనవరి 30: సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలల్లో స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు రాక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పెంచిన మెస్ చార్జీలు అమలు కావడడం లేదని, వార్డెన్లు అప్పులు చేసి హాస్టల్స్‌ను నడిపిస్తున్నారని చెప్పారు. స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు విడుదల చేయకుండా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామనడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలని కోరారు. లేదంటే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టి ప్రజాదర్బార్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్, నాయకులు రాజేష్, వాణి, సాక్షి, రవి, కిరణ్‌గౌడ్, అజయ్, హరీష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా: సునితారెడ్డి

శివ్వంపేట/మాసాయిపేట, జనవరి 30: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి అన్నారు. మంగళవారం పలు గ్రామాల్లో ఆమె అభివృద్ధి పనులను ప్రారంభించి, మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్‌ప్లాంటు, పార్కు, స్ట్రీటులైట్లు, సీసీ కెమెరాలను సర్పంచ్ కీర్తనహన్మంతరావుతో కలిసి ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎంపీపీ హరికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, నాయకులు చంద్రాగౌడ్, రమణాగౌడ్, వెంకట్‌రెడ్డి, మాధవరెడ్డి, మహేందర్‌రెడ్డి, సునందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎంపీపీ హరికృష్ణ ఆధ్వర్యంలో శివ్వంపేటలో నిర్వహించిన సమావేశంలో మండలంలోని సర్పంచులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు రమాకాంత్‌రెడ్డి, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎంపీడీవో భారతి పాల్గొన్నారు. మాసాయిపేటలో ప్రాథమిక సహకార భవనాన్ని, మండలంలోని కొప్పులపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో అదనపు భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి రాజిరెడ్డి, సర్పంచ్ మధుసూధన్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, నాయకులు ఆనంద్‌రెడ్డి, డైరెక్టర్ నర్సింహులు పాల్గొన్నారు. మాసాయిపేటలో వీర వనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సర్పంచ్ రెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ నర్సింహులు, రజక సంఘం నాయకులు సోమేష్, సత్తయ్య, నర్సింహులు పాల్గొన్నారు.



శివ్వంపేటలో సర్పంచులను సన్మానించిన ఎమ్మెల్యే

రెవెన్యూ, ఫారెస్టు భూముల సర్వేలు చేపడతాం

● **మెదక్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్**

రేగోడు, జనవరి 30: రెవెన్యూ, ఫారెస్టు భూములకు హద్దులు గుర్తించేందుకు సర్వే చేపడుతామని మెదక్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ అన్నారు. మంగళవారం రేగోడు మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో రెవెన్యూ, ఫారెస్టు భూముల హద్దులను ఆయన పరిశీలించారు. ఫారెస్టు అధికారులతో కలిసి ప్రభుత్వ భూముల సర్వే చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఆయనవెంట తహసీల్దార్ బాలలక్ష్మీ, ఆర్ఐ ఫిరోజ్, సర్వేయర్, సిబ్బంది రవి ఉన్నారు.

● **పెద్దశంకరంపేట:** పెద్దశంకరంపేట పట్టణ శివారులోని ప్రభుత్వ స్థలాలను మెదక్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్, డీపీవో సాయిబాబా మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని తెలియడంతో ఈ స్థలాలను పరిశీలించినట్లు వారు తెలిపారు. వారివెంట తహసీల్దార్ గ్రేస్‌బాయ్, ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా, సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాయిని మధు, నాయకులు ఆర్ఎస్.సంతో‌ష్‌కుమార్, రాజేందర్‌గౌడ్, దాచ సంగమేశ్వర్, దేవేందర్, సంగప్ప, మాణిక్యం, గంగారెడ్డి, మల్గొండ, చంద్రశేఖర్ ఉన్నారు.



నిజాంపేట మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో మైసమ్మ కుంటను పరిశీలిస్తున్న అధికారులు

మైసమ్మ కుంటను పరిశీలించిన అధికారులు

నిజాంపేట: మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో మైసమ్మ కుంటను మంగళవారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. మైసమ్మ కుంటలో మట్టి తవ్వకాలు జరిగినట్లు తెలియడంతో పరిశీలించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనవెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివ నాగరాజు, ఏఈఈ కుశాల్, మాజీ సర్పంచ్ గోపరి నర్సింహులు ఉన్నారు.

కాజీపల్లిలో అక్రమ కట్టడాల కూల్చివేత

జిన్నారం: కాజీపల్లి 181 సర్వే నంబరులో వెలసిన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. మంగళవారం ఆర్ఐ జయప్రకాష్ ఆధ్వర్యంలో కట్టడాలను నేలమట్టం చేశారు.

తూప్రాన్ చెరువుల కబ్జాపై కేసులు

తూప్రాన్: తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని రావెల్లి, బ్రాహ్మణపల్లిలో చెరువుల ఎఫ్‌టీఎల్ కబ్జాపై ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. రావెల్లి శివారులోని గీతా కళాశాల యాజమాన్యం కొత్త చెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టిని పోసినట్లు వివరించారు. ఇరిగేషన్ డీఈఈ శ్రీకాంత్, ఏఈ అనురాధ, రెవెన్యూ సర్వేయర్ బాలు నోటీసు జారీ చేసినా మట్టిని తొలగించలేదని చెప్పారు. దీంతో కళాశాల యాజమాన్యం రామాంజనేయులు, వెంకటకృష్ణ, రవీందర్‌గౌడ్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం వివరించారు. బ్రాహ్మణపల్లి శివారులోని ఊర చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమంగా మట్టిని నింపి, కల్వర్టు మూసివేసినట్లు ఎస్ఐ శివానందం వివరించారు. ఈ విషయంలో ఇరిగేషన్ డీఈఈ శ్రీకాంత్, ఏఈ అనురాధ ఫిర్యాదు మేరకు ఎఫ్‌టీఎల్‌లో మట్టి నింపిన వెంకట మధుసూదన్, మిలియంరెడ్డిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.



రేగోడు మండలం తిమ్మాపూర్‌లో ప్రభుత్వ భూముల హద్దులను పరిశీలిస్తున్న మెదక్ ఆర్డీవో రాజేశ్వర్

ఆరోపణలను రుజువు చేయాలి

సంగారెడ్డి రూరల్: తాను బ్లాక్‌మెయిల్ చేస్తున్నానని శ్రీనిధి క్రషర్ యజమాని సుమంత్‌రెడ్డి, శంభు ప్రసాద్, వడ్డె కుమార్, వడ్డె నర్సింగ్‌రావులు చేస్తున్న ఆరోపణలను రుజువు చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే ఉద్దేశంతో ఆరోపణలు చేస్తున్నారని, రుజువు చేయని పక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్తు

కోహీర్: విద్యార్థులు కష్టపడి చదువుకుంటేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియోద్దీన్ అన్నారు. మంగళవారం కోహీర్‌తో పాటు మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామాల్లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లు, నోట్‌బుక్స్, పెన్నులు, పరీక్ష ప్యాడ్లను అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం

నారాయణఖేడ్: పీకేఆర్ ట్రస్టు, లయన్స్‌క్లబ్, హోలిస్టిక్ వైద్యశాలల ఆధ్వర్యంలో ఖేడ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరానికి నియోజకవర్గం నలుమూలల నుంచి జనాలు తరలి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

నేడు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ పట్టణ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారని ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు.

పంటల సాగుపై అవగాహన

వట్‌పల్లి: రైతులకు పంటల సాగు, దిగుబడులపై మంగళవారం వట్‌పల్లి రైతువేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త రాహుల్ విశ్వకర్మ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పలు ప్రదర్శనలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు.

పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కృష్ణారెడ్డి

సంగారెడ్డి అర్బన్, జనవరి 30: పీఆర్టీయూ-తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పన్నీరు కృష్ణారెడ్డి మంగళవారం ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

సిగరెట్ ప్యాకెట్ల సీజ్

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలో మంగళవారం రాత్రి పలుదుకాణాల్లో తనిఖీలు చేసి, నిషేధిత 236 సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ సాయిలు, జహీరాబాద్ పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మహ్మద్ ఖదీర్ అనుమతులు లేకుండా దుకాణం నిర్వహిస్తూ, నిషేధిత సిగరెట్లను అమ్ముతున్నాడన్నారు. నిషేధిత సిగరెట్లను అమ్ముతున్న ఖదీర్‌ను అదుపులోకి తీసుకుని, సిగరెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చెకుముఖి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

నారాయణఖేడ్: మండల స్థాయిలో నిర్వహించిన చెకుముఖి పోటీల్లో స్థానిక గాయత్రి పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కళింగ కృష్ణకుమార్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మన్మథకిషోర్ పాల్గొన్నారు.

ప్రజలకు నమ్మకం కల్పించి ఓట్లు సాధించాలి

● **జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి**

కల్హేర్/కంగ్టి/పెద్దశంకరంపేట, జనవరి 30: గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేసి పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ స్థానాన్ని గెలిపించుకోవాలని జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి కాటేపల్లి వెంకటరమణారెడ్డి సూచించారు. మంగళవారం కల్హేర్, కంగ్టి, పెద్దశంకరంపేటలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు పార్టీ పట్ల నమ్మకం కలిగించి, ఓట్లు సాధించాలని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని, గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు అర్హులకు అందకుంటే అధికారులను ప్రశ్నించాలన్నారు. ఆయా సమావేశాల్లో జహీరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రవిగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి జన్‌వాడే సంగప్ప, కన్వీనర్ రజనీకాంత్, రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు కరణం సంగమేశ్వరరావ్, కల్హేర్ మండలాధ్యక్షుడు అల్లాపురం రాజు, ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, బీజేవైఎం, ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు సతీష్, అభిలాష్, నాయకులు పట్నం మాణిక్, విటల్, పండరి, రమేష్ సాయిలు, నారాయణ, దత్త్రాత్రి, పండరి, మధు, కిష్టారెడ్డి, నగేష్, సంతోష్, బాలాజీ, రాజు, కిరణ్, మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, పేట మండలాధ్యక్షుడు కోణం విఠల్, నియోజకవర్గ నాయకులు రజనీకాంత్, పట్నం మాణిక్యం, నాయకులు శ్రావణ్‌కుమార్, బుగుడాల కృష్ణ, మంగలి కృష్ణ, అనిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.25లక్షల విలువజేసే గంజాయి పట్టివేత

రామచంద్రాపురం, జనవరి 30: రూ.25లక్షల విలువజేసే గంజాయిని రామచంద్రాపురం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ నుంచి 12 కిలోల గంజాయిని రెండు బ్యాగుల్లో పెట్టుకుని అనుమానాస్పదంగా తిరుగుతున్న అజయ్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. కాకినాడ నుంచి గంజాయిని తక్కువ ధరకు తీసుకువచ్చి కర్నాటకలో అధిక ధరకు విక్రయిస్తున్నట్టు చెప్పాడు. దాని విలువ రూ.25 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

భూ తగాదాలతో వ్యక్తిపై హత్యాయత్నం

చిలప్‌చెడ్, జనవరి 30: భూ తగాదాలతో వ్యక్తిపై హత్యాయత్నం జరిగిన సంఘటన మండల పరిధిలోని రాందాసుగూడా గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాందాసుగూడా గ్రామానికి చెందిన ఇప్ప వెంకటేశ్వర్‌రావు 2003లో తన మేన మామ యగు మురళీధర్‌రావుకు చెందిన సోమక్కపేట గ్రామ శివారులోని మెట్ట భూమిని ఎకరానికి రూ.80,000 చొప్పున మూడు ఎకరాలు కొనుగోలు చేశాడు. నాటి నుంచి అతడే కాస్తులో ఉన్నాడు. 2023 జూన్ నుంచి మురళీధర్‌రావు కొడుకు అరుణ్‌కుమార్ అక్రమంగా భూమిలోకి ప్రవేశిస్తూ, ఆ భూమి తమదేనంటూ గొడవకు దిగుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం వెంటేశ్వర్‌రావు ఇంటిలో ఉండగా తలుపులు తట్టి లోపలికి వెళ్లిన ఇద్దరు వెంకటేశ్వర్‌రావు కళ్లలో కారం కొట్టి, కత్తితో దాడి చేయడంతో చేతులకు, ఎడమ భుజానికి గాయాలయ్యాయి. తేరుకున్న వెంకటేశ్వర్‌రావు గట్టిగా అరవడంతో స్థానికులు రావడాన్ని గమనించిన దుండగులు పారిపోయేందుకు యత్నించారు. వారిలో ఒకరిని పట్టుకున్న స్థానికులు అడగగా... తన పేరు దినే‌ష్‌కుమార్ అని, తన వెంట వచ్చినది రాహుల్ అని తెలిపారు. వెంకటేశ్వర్‌రావును చంపడానికి తమను అరుణ్‌కుమార్ కారులో తీసుకువచ్చాడని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అరుణ్‌కుమార్, దినేష్, రాహుల్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహబూబ్ తెలిపారు.

పరిశ్రమలో కార్మికుడి మృతి

● **సమాచారం ఇవ్వలేదని కుటుంబీకుల ఆందోళన**

హత్నూర, జనవరి 30: పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం హత్నూర మండలంలో జరిగింది. హత్నూర మండలం బోర్పట్ల గ్రామానికి చెందిన కొప్పు నర్సింహులు(32) గ్రామ శివారులోని ఏపీటోరియా యూనిట్-1 పరిశ్రమలో పది సంవత్సరాలుగా కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. మంగళవారం పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ కుప్పకూలి ఖడికక్కడే మృతి చెందాడు. పరిశ్రమ ప్రతినిధులు ఈ విషయాన్ని మృతుడి కుటుంబానికి చెప్పకుండా చికిత్స పేరిట సంగారెడ్డి సమీపంలోని ఎంఎన్ఆర్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, గ్రామస్థులు పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే నర్సింహులు మృతి చెందాడని ఆగ్రహిస్తూ మృతదేహాన్ని అంబులెన్సులోనే పరిశ్రమ ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి యాజమాన్యంతో చర్చించి న్యాయం చేస్తామని సీఐ వేణుకుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ పేర్కొన్నారు. కాగా మృతుడికి భార్య అనిత, ఇద్దరు కూతుర్లు రక్షిత, హర్షిత ఉన్నారు.

పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్రం

జహీరాబాద్, జనవరి 30: కేంద్రప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ కార్మికులకు, ప్రజలకు అన్యాయం చేస్తున్నదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు విమర్శించారు. మంగళవారం పట్టణంలోని మహీంద్రా కర్మాగారంలో ప్రధానికి పంపించేందుకు సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలు, లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, లేనిపక్షంలో ఉత్పత్తులను స్తంభింపజేసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఫిబ్రవరి 16న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో పోటీలు

గజ్వేల్, జనవరి 30: గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి బాలికల సీనియర్ ఖోఖో పోటీలను మంగళవారం ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని జడ్పీహెచ్ఎస్ తీగుల్(సిద్దిపేట), ద్వితీయ బహుమతిని కృష్ణాపూర్(సంగారెడ్డి), తృతీయ బహుమతిని ప్రజ్ఞాపూర్ మైనారిటీ బాలికల పాఠశాల(సిద్దిపేట), నాలుగవ బహుమతిని ప్రజ్ఞాపూర్-సెయింట్ మేరీస్ విద్యానికేతన్(సిద్దిపేట) దక్కించుకున్నాయి.

పౌర హక్కులపై అవగాహన

నిజాంపేట, జనవరి 30: మండల పరిధిలోని నందిగామ గ్రామంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. సమాజంలోని అసమానతలు, కుల వివక్ష, దళితులపై దాడులు, అంటరానితనం, మూఢనమ్మకాల నిర్మూలనపై ఆర్ఐ గంగాధర్, ఏఎస్ఐ జైపాల్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సురేష్, పంచాయతీ కార్యదర్శి హరీఫ్ హుస్సేన్, అంగన్‌వాడీలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచులకు ఎంపీపీ సన్మానం



చేగుంటలో సర్పంచులను సన్మానించిన ఎంపీపీ, ఎంపీడీవో

చేగుంట, జనవరి 30: చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాసుల శ్రీనివాస్, ఎంపీడీవో ఆనంద్‌మేరీ సర్పంచులను సన్మానించారు. ఐదు సంవత్సరాలుగా గ్రామాల అభివృద్ధికి సర్పంచులు ముఖ్య భూమిక పోషించారని ఎంపీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, సర్పంచులు అశోక్, రాములు, మహిపాల్, భాస్కర్, ఎల్లారెడ్డి, కుమ్మరి శ్రీనివాస్, నెల్లూరు మల్లయ్య, మోహన్, స్వాతి, స్వరణలత, నిర్మల, సంతోష, లక్ష్మి, గీత, నరసవ్వ పాల్గొన్నారు.

పలు పట్టణాల్లో బాధ్యతలు స్వీకరించిన సీఐలు

మెదక్ అర్బన్/సంగారెడ్డి క్రైం/నర్సాపూర్/రామాయంపేట/తూప్రాన్, జనవరి 30: మెదక్ టౌన్ సీఐగా దిలీప్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు పనిచేసిన వేంకటేష్ రామాయంపేట సీఐగా బదిలీ కాగా.. ఆయన స్థానంలో దిలీప్‌కుమార్‌ను నియమించారు. సంగారెడ్డి రూరలల్ సీఐగా పి.అశోక్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని ఐజీ కార్యాలయం నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. నర్సాపూర్ సీఐగా రంగ కృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు పనిచేసిన శేక్ లాల్‌మదార్ ఐజీ కార్యాలయానికి అటాచ్ చేయగా ఆయన స్థానంలో గజ్వేల్ సీఐగా ఉన్న రంగ కృష్ణ బదిలీపై వచ్చారు. రామాయంపేట సీఐగా బి.వెంకటేశం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన లక్ష్మీబాబు ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. తూప్రాన్ సీఐగా రెడ్డబోయిన కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు పనిచేసిన శ్రీధర్ ఐజీ కార్యాలయానికి బదిలీ చేశారు. బిచ్కుందాలో పనిచేస్తున్న కృష్ణను తూప్రాన్‌కు బదిలీ చేశారు.